సాక్షి
నిజామాబాద్
బుధవారం । 22 । నవంబర్ । 2023



ఆత్మీయ సమ్మేళనాలు..
పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండడంతో అభ్యర్థులు ఆయా కుల సంఘాలతో సమ్మేళనాలు నిర్వహించడంలో బిజీగా మారారు.
- 10లో ▸



పోలింగ్ కేంద్రాల పరిశీలన
నవీపేటలోని పలు పోలింగ్ కేంద్రాలను అడిషనల్ డీజీపీ జయరాం తనిఖీ చేశారు. ఓటర్లకు అన్ని వసతులు కల్పించాలన్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /19.3

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉండవచ్చు. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఏసీబీకి చిక్కిన ఏవో

- రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్

బిచ్కుంద(జుక్కల్): ఓ ఫర్టిలైజర్ దుకాణదారుడి నుంచి లంచం తీసుకుంటుండగా మండల వ్యవసాయాధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని అన్నదాత ఫర్టిలైజర్ దుకాణ లైసెన్స్, రెన్యువల్‌కు ప్రతి ఏడాది లంచం ఇవ్వాలని ఏవో పోచయ్య నిర్వాహకుడిని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకుంటే ఏదో ఒక కేసు పెట్టి క్రిమినల్ కేసు నమోదు చేస్తానని ఏవో బెదిరించాడు. దీంతో నిర్వాహకుడు గుండెకల్లూర్ గంగాధర్ రూ.18 వేలతో ఏవోతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముందుగా గంగాధర్ ఏవోకు రూ.8 వేలు ఇవ్వగా, మరో రూ. పదివేలు త్వరగా ఇవ్వాలంటు ఒత్తిడి చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కెమికల్ పూసిన నగదును ఏవో ఇంటికి వెళ్లి బాధితుడు ఇవ్వగా అనుమానం వచ్చిన పోచయ్య అక్కడ డబ్బులు తీసుకోకుండా ఓ ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకుడు గోపీకి ఇవ్వాలని సూచించారు. దీంతో అక్కడికెళ్లి గోపీకి నగదు ఇవ్వగానే ఏసీబీ అధికారులు గోపీని పట్టుకున్నారు. ఏవో పోచయ్య ఫోన్ చేసి చెప్పడంతోనే నగదు తీసుకున్నట్లు గోపి తెలిపారు. డబ్బులు తీసుకున్న గోపీ, ఏవో పోచయ్యను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఏవోపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. ఆయన వెంట సీఐలు నాగేశ్, శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

ఓటేసిన 180 మంది ఉద్యోగులు

సుభాష్‌నగర్ : రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 180 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా మంగళవారం ఓటు హక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాజేంద్రకుమార్ ప్రకటనలో తెలిపారు.

టీచర్లకు నోటీసులు

- 34 స్కూళ్లలో మొబైల్ యాప్‌లో అటెండెన్స్ వేయని వైనం

ఖలీల్‌వాడి : జిల్లాలోని 34 ప్రభుత్వ పాఠశాలలోని టీచర్లు డీఎస్ఈ, ఎఫ్ఆర్ఎస్ మొబైల్‌యాప్‌లో అటెండెన్స్ నమోదు చేయనందున జిల్లా విద్యాశాఖధికారి దుర్గాప్రసాద్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. మొబైల్ యాప్‌లో అటెండెన్స్ వేయని హెడ్మాస్టార్లు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాళ్లు ఈనెల ఈనెల 21వ తేదీ వరకు డీఈవో ఆఫీస్‌లో వివరణ ఇవ్వడానికి గడు వు విధించారు. కాని 34 స్కూళ్ల గడువు తేదీ ముగిసినా సమాధానం ఇవ్వలేదు. దీంతో బుధవారం వరకు మరో అవకాశమిచ్చారు. అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

కూడికలు.. తీసివేతలు

- ముఖాముఖి పోటీ ఉన్న చోట్ల ఎత్తులకు పైఎత్తులు
- త్రిముఖ పోరు నడిచే స్థానాల్లో ఓట్ల చీలికపై లెక్కలేస్తున్న అభ్యర్థులు
- ఓ వర్గం ఓట్లతో లాభమా.. నష్టమా అనే అంశాలపై ఆరా..!

పోలింగ్‌కు సమయం సమీపిస్తున్నకొద్దీ అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్ ఏవిధంగా చేయాలనే విషయమై ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు. ప్రచారానికి వారంరోజులు మాత్రమే మిగిలి ఉండడంతో స్పీడ్‌గా ప్రచారం చేస్తున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో పెద్ద నాయకులను సభలు, సమావేశాలకు, కార్నర్ మీటింగులకు తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



జిల్లాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచార పర్వం కొనసాగిస్తూనే ఓటర్లను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ఇతరత్రా ముఖ్యమైన కార్యకలాపాలను పక్కాగా కొనసాగిస్తున్నారు. ఇవన్నీ చేసుకుంటూనే ప్రత్యర్థుల వ్యవహారాలపై దృష్టి పెడుతున్నారు. ఎత్తులు, పైఎత్తులు వేసుకుంటూ ముందుకు కదులుతున్నారు. మరోవైపు ఏ వర్గం ఓట్లు ఎటు మల్లుతున్నాయి.. ఆయా ఓట్లు ఏవిధంగా నమోదయ్యే అవకాశాలున్నాయి.. చీలిపోతాయా అనే విషయాలపై లెక్కలు వేసుకుంటున్నారు. ఓట్లు గంపగుత్తగా పడే అవకాశముందా, చీలిపోతాయా అనే విషయాలపైనా అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు.

ఇందుకు సంబంధించి కూడికలు, తీసివేతల మీద లెక్కలు వేసుకుంటున్నారు. ఎన్నికలు ముఖాముఖిగా జరిగే నియోజకవర్గాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు నువ్వానేనా అనేవిధంగా ఎత్తులు, పైఎత్తులు వేసుకుంటూ వ్యూహాలు రచిస్తున్నారు. మరోవైపు త్రిముఖ పోటీ ఉన్న నియోజకవర్గాల్లో అయితే కూడికలు, తీసివేతలు బేరీజు వేసుకుంటూ లెక్కలు వేసుకుంటున్నారు. ఓట్ల చీలికల పైనే లెక్కలు వేసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సగం నియోజకవర్గాల్లో త్రిముఖ పోరు నెలకొనడంతో పాటు పరిణామాలు ఎప్పటికప్పుడు మారుతుండడంతో ఉద్దండులైన అభ్యర్థులు సైతం ట్రెండ్ అర్థం కాక వివిధ కోణాల్లో విశ్లేషణలు చేసుకుంటూ ముందుకు కదులుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు జిల్లా కేంద్రాలైన నిజామాబాద్ అర్బన్, కామారెడ్డితో పాటు ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు చాలా దూకుడుగా నువ్వానేనా అనేవిధంగా వెళ్తున్నారు. కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డి బరిలో ఉన్నప్పటికీ బీజేపీ అభ్యర్థి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక్కడికి వరుసగా ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ రానుండడంతో మరింత ఆసక్తి నెలకొంది. నిజామాబాద్ అర్బన్, బాల్కొండ, ఆర్మూర్‌లో కూడా త్రిముఖ పోరు నడుస్తుండడంతో అభ్యర్థులు ఎప్పటికప్పుడు లెక్కలు వేసుకుంటూ వ్యూహాలు మార్చుకుంటున్నారు. బాల్కొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణమ్మ దూకుడుగా వెళ్తుండడంతో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి సైతం ఎప్పటికప్పుడు కూడికలు, తీసివేతలతో లెక్కలు వేసుకుంటున్నారు. బోధన్‌లోనూ బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి కారణంగా ఫలితం ఏవిధంగా ఉంటుందో అనే టెన్షన్ కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల్లో నెలకొంది.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, రిటర్నింగ్ అధికారులు

సుభాష్‌నగర్: ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులతో సీఈవో మంగళవారం సాయంత్రం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన వివిధ అంశాలకు సంబంధించిన నివేదికలను అందించడంలో తాత్సారం చేయొద్దని సూచించారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతానికిపైగా వైకల్యం ఉన్న దివ్యాంగులు ఇళ్ల నుంచే ఓటుహక్కు వినియోగించుకునేలా చేపట్టిన చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లు, పోలింగ్, కౌంటింగ్‌కు కసరత్తులు గురించి ఆరా తీశారు. పట్టణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం గ్రామీణ ప్రాంతాల్లో 60 శాతం వెబ్ క్యాస్టింగ్ చేయాలని, మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఈఓ సూచించారు. నూతన ఓటర్లకు పోస్టల్ శాఖ ద్వారా గుర్తింపుకార్డులు పంపిణీ చేయడంతోపాటు వాటి వివరాలు సమర్పించాలన్నారు. రోజువారీ ఓటరు స్లిప్పుల పంపిణీ వివరాల నివేదికను అందజేయాలన్నారు. సువిధ పోర్టల్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత గడువులోగా అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరందు, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ రిటర్నింగ్ అధికారులు రాజేంద్రకుమార్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్, కవిత వ్యాపార భాగస్వాములు

- కాంగ్రెస్ గెలిస్తే ఎన్డీఎస్ఎల్ భూములను అమ్ముకుంటారు
- యువశక్తి విజయ సంకల్ప సభలో ఎంపీ అర్వింద్



యువశక్తి విజయ సంకల్ప సభలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

బోధన్‌టౌన్(బోధన్): పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత వ్యాపార భాగస్వాములని, కాంగ్రెస్ గెలిస్తే వారిద్దరూ కలిసి ఎన్డీఎస్ఎల్ భూములను ప్లాట్లుగా చేసి అమ్ముకుంటారని, తెలంగాణ సీఎం కేసీఆర్ కంటే కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పెద్ద దొంగ అని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. పసుపు, చెరుకు పంటలను కాంగ్రెస్ నాశనం చేసిందని విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని రమాకాంత్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన యువశక్తి విజయ సంకల్పసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చక్కెర ఫ్యాక్టరీల పునఃప్రారంభం కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే సాధ్యమవుతుందని, బీజేపీకి ఓటు వేసి చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించుకుందామని అన్నారు. కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థిని ఓడించడానికే రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, రెడ్డి సామాజిక వర్గం ఓట్లు చీల్చేందుకే బరిలో దిగారని ఆరోపించారు. బోధన్ నియోజక వర్గంలో బీజేపీకి 1994 ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు వచ్చాయని, ప్రస్తుతం మిమ్ముల్ని చూస్తుంటే ఈసారి బోధన్ గడ్డపై బీజేపీ గెలుపు ఖాయమని విశ్వాసం కలుగుతోందని యువతనుద్దేశించి అన్నారు. బోధన్‌లో సాగుతున్న సతాయింపులు, కులరాజకీయాలకు స్వస్తి పలుకుదామని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి గెలిచినా, ఓడినా బోధన్‌కు రారన్నారు. బీసీల ను కాంగ్రెస్ అవమానించిందని, ఉమ్మడి జిల్లాలో ఒక్క సీటుకూడా బీసీలకు ఇవ్వలేదని మండిపడ్డారు. 30ఏళ్ల ఉద్యమ ఆకాంక్షను గుర్తించి ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారన్నారు. మందకృష్ణమాదిగ చెప్పినట్లు బీసీల్లో మార్పు రావాలని, ఇకనైనా కండ్లు తెరవాలని కోరారు. బీజేపీ బీసీని సీఎంని చేస్తామని ప్రకటించిందన్నారు. అందుబాటులో ఉండే బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, ప్రభారీలు నర్సింహారెడ్డి, రాంచరణ్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వినోద్, పట్టణ అధ్యక్షులు బాలరాజు, జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్ చారి, శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసులోటి గోపీకిషన్, ఎమ్మార్పీఎస్ ప్రతినిధి దిలీప్ తదితరులున్నారు.

ఒక్కరూ పలకరించలే..

కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన డీఎస్ అనారోగ్యంతో ఉంటే కనీసం పలకరించడానికి రాహుల్ గాంధీ, ప్రియాంక రాలేదని, రాష్ట్రంలో గాలికి తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ ఇద్దరూ తోడుదొంగలేనన్నారు. సంచులు మోయడానికే రేవంత్ రెడ్డి పనిచేస్తారని ఆరోపించారు. ఎన్నికల్లో అర్వింద్ ఎక్కడ పోటీచేస్తే అక్కడ పోటీ చేస్తానని ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్సీ కవిత కోరుట్లలో ఎందుకు పోటీ చేయట్లేదన్నారు.

అభివృద్ధే మా నినాదం

- దళితులను ఆదుకునేందుకే దళితబంధు పథకం
- మాదిగ సామాజిక వర్గం సమావేశంలో ఎమ్మెల్సీ కవిత
- బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన కుల సంఘాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్ నాగారం : ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి అన్నది సీఎం కేసీఆర్ సంకల్పమని, అందరితో సమానంగా దళితులు కూడా ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో దళిత బంధు పథకాన్ని అమలు చేస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. మంగళవారం నగరంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పలు మాదిగ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి వారు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ దళితబంధు వల్ల వచ్చిన ఆర్థిక సాయంతో చేస్తున్న వ్యాపారాలకు కూడా దళిత రక్షణ నిధి పేరిట బీమా సౌకర్యాన్ని సీఎం కల్పించారన్నారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, మెడికల్ షాపుల స్థాపించుకోవడంలోనూ ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. మాదిగ సంఘాల నాయకులు మాట్లాడుతూ దళిత బంధుతో తమకు సీఎం కేసీఆర్ పునర్జన్మను ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా బోధన్ నియోజకవర్గానికి చెందిన రెడ్డికా కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రెడ్డి, పర్దె రాజు నేతృత్వంలో మంగళవారం నగరంలో ఎమ్మెల్సీ కవితతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్‌కు పూర్తి మద్దతుగా ఉంటామన్నారు.

ముదిరాజ్‌ల హక్కులను కాపాడుతాం

ఉమ్మడి ఏపీలో మత్స్య సొసైటీలు నిర్వీర్యమయ్యాయని, సీఎం కేసీఆర్ వాటిని సరిదిద్దారని, ముదిరాజ్‌ల హక్కులను కాపాడుతామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. గతంలో కాంట్రాక్టర్లు చెరువుల్లో చేపపిల్లలను వేసేవారని, ఇప్పుడు నేరుగా ప్రభుత్వమే చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలను వదులుతోందన్నారు.

జిల్లాకు చెందిన ముదిరాజ్ కుల సంఘం నేతలు మంగళవారం ఎమ్మెల్సీ కవితతో సమావేశమయ్యారు. సొసైటీల ఏర్పాటు, నిర్వహణ విషయంలో ఉన్న కొన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు. జిల్లాలో ముదిరాజ్ భవనం నిర్మాణానికి భూమి, నిధులు మంజూరు చేసేలా చూస్తానన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కవిత ముదిరాజ్ కులస్తులతో పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించడానికి జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- బాన్సువాడను ప్రగతిపథంలో నడిపించాం
- విద్య, వైద్య రంగాలను మెరుగుపర్చాం
- ప్రజా సేవకే నా జీవితం అంకితం
- 'సాక్షి'తో బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి

సీఎం కేసీఆర్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలతో ఇప్పటికే నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించి, అభివృద్ధి చేశా. మౌలిక వసతులు కల్పించా. మరోసారి గెలిపిస్తే ఎన్నికల తర్వాత ప్రతి గ్రామానికి వెళ్తా. వారికి ఇంకా ఏం కావాలో తెలుసుకుని వాటిని నెరవేర్చడానికి కృషి చేస్తా. మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకాన్ని అమలు చేస్తాం.



''బాన్సువాడ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించా. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేలా చూశా. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇచ్చా. రాష్ట్రంలోనే అత్యధికంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి పేదలకు పంపిణీ చేశాం. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం'' అని బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. మంగళవారం ఆయనను 'సాక్షి' ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు..

బాన్సువాడ: ప్రస్తుత ఎన్నికలు వ్యక్తి కోసం కాదు.. ప్రజల కోసం జరుగుతున్నాయి. జనం నచ్చిన వ్యక్తినే గెలిపించుకుంటారు. ఏ పార్టీ సిద్ధాంతాలు బాగున్నాయే ఆ పార్టీనే ఎన్నుకుంటారు. ప్రచారానికి వెళ్తున్న నాకు ప్రతి గ్రామంలో స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున స్వాగతం లభిస్తోంది.

11 వేల ఇళ్లు నిర్మించాం

సీఎం కేసీఆర్ అండతో బాన్సువాడ నియోజకవర్గాన్ని రూ.11 వేల కోట్లతో అభివృద్ధి చేశాను. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చాం. గృహలక్ష్మి పథకం కింద నియోజకవర్గంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడానికి కృషి చేస్తా.

పాలన చేరువైంది..

గతంలో నియోజకవర్గంలో బాన్సువాడ, బీర్కూర్, కోటగిరి, వర్ని మండలాలున్నాయి. నస్రుల్లాబాద్, మోస్రా, చందూర్, రుద్రూర్, పోతంగల్ మండలాలను ఏర్పాటు చేశాం. తండాలు, చిన్న చిన్న పల్లెలనూ పంచాయతీలుగా చేశాం. దీంతో ప్రజలకు పాలన చేరువైంది.

మున్సిపాలిటీలో..

బాన్సువాడను మున్సిపాలిటీగా చేశాం. పట్టణ పరిధిలో ఇప్పటివరకు రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.

నిరుద్యోగ యువతకోసం..

నా జీవితం ప్రజా సేవకే అంకితం. కుటుంబ సభ్యులతోకంటే నియోజకవర్గ ప్రజలతోనే ఎక్కువ సమయం గడిపాను. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించాం. నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాం. ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు శిక్షణ ఇప్పిస్తున్నాం. మేం కోచింగ్ ఇప్పించినవారిలో చాలామంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు పొందారు. ఆనందంగా ఉంది.

విద్యారంగం..

1994లో మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు బాన్సువాడలో ఒకే ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండేది. ప్రస్తుతం నియోజకవర్గంలో 31 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలలున్నాయి. విద్యాసంస్థల కోసం రూ.250 కోట్లు ఖర్చు చేశాం.

వైద్యరంగం..

బాన్సువాడలో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నాం. సుమారు రూ.200 కోట్లు కేటాయించి వైద్యరంగాన్ని పటిష్టం చేశాం. బాన్సువాడ పట్టణంలో రూ. 20 కోట్లతో నిర్మించిన మాతా శిశు ఆస్పత్రితో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. దీంతో ఈ ఆస్పత్రి దేశంలోనే గుర్తింపు పొందింది. రూ.40 కోట్లతో నర్సింగ్ కళాశాల భవనం, వసతి గృహ నిర్మాణం చేపడుతున్నాం.

సాగునీరు..

నియోజకవర్గంలో ఎక్కువగా రైతులున్నారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. నీటి పారుదల రంగాన్ని రూ. 1000 కోట్లతో అభివృద్ధి చేశాం. రూ.150 కోట్లతో నిజాంసాగర్ కాలువలను ఆధునికీకరించాం. రూ.200 కోట్లతో సిద్దాపూర్ రిజర్వాయర్, రూ.150 కోట్లతో జాకోర, చందూర్ ఎత్తిపోతల పథకం, రూ.150 కోట్లతో మంజీర నదిపై నాలుగు చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టాం. రూ.100 కోట్లతో చిన్న ఎత్తిపోతల పథకాల నిర్మిస్తున్నాం.

రహదారుల అభివృద్ధి..

ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేశాం. నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా రోడ్ల విస్తరణ, బ్రిడ్జీల నిర్మాణం, రోడ్ల మరమ్మతులకు వెయ్యి కోట్ల రూపాయలపైనే ఖర్చు చేశాం.



క్లుప్తంగా

6 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజును డిసెంబర్ 6వరకు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ మంగళవారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులు 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2, 4, 6వ బ్యాక్‌లాగ్ పరీక్షలకు ఈ షెడ్యూల్ వర్తిస్తుందన్నారు. రూ. వంద అపరాధ రుసుముతో డిసెంబర్ 7వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



రుద్రూర్ : ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి సుదర్శనం సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు.రోగులు అందిస్తున్న చికిత్సను పరిశీలించారు.ఆస్పత్రి రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. సాధారణ ప్రసవాలు పెంచాలని సూచించారు. ఆయనతో మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నవీపేట: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలతో పాటు కోస్లీ, నాగేపూర్, యంచ పోలింగ్ కేంద్రాలను నిజామాబాద్ అడిషనల్ డీసీపీ జయరాం మగళవారం పరిశీంచారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై యాదగిరి, సిబ్బంది ఉన్నారు.


కాలుష్యంతో వ్యాధుల విజృంభణ



నిజామాబాద్‌నాగారం: గాలి కాలుష్యం వల్ల ప్రజలు వ్యాధులకు గురవుతున్నట్లు జిల్లా ఆరోగ్య విద్య బోధకుడు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జీజీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు మానసిక ఒత్తిడి, వాతావరణ కాలుష్యంపై అవగాహన కల్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా వాతావరణ కాలుష్యం తగ్గించవచ్చన్నారు. జిల్లా మానసిక వైద్యుడు రవితేజ మాట్లాడుతూ.. విద్యార్థులు పోషకాహారం, యోగా, మెడిటేషన్‌తో ఏకాగ్రత పెంపొందించుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ వేణు ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు సతీశ్ కుమార్, సునీత, అధ్యాపకులు కుమారస్వామి, రవిరాజ్, అంబర్ సింగ్, దేవిదాస్ ఉన్నారు.

ప్రచార సభలు.. ఆత్మీయ సమ్మేళనాలు

- జిల్లాలో వేడెక్కిన ప్రధాన పార్టీల ప్రచారం
- 8 రోజులే గడువుండటంతో కులసంఘాలపై దృష్టి



జంగ్ తెలంగాణ

ఖలీల్‌వాడి: పోలింగ్ సమయం సమీపిస్తున్నందున జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఎన్నికలకు ఇంకా 8 రోజులే ఉండటంతో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నియోజకవర్గాల వారిగా సామాజిక లెక్కలను బేరీజు వేసుకుంటున్నాయి. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలైన అర్బన్, రూరల్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ప్రచారానికి పదును పెడుతూ తమదైనశైలిలో ప్రజలను మచ్చిక చేసుకుంటున్నారు. వివిధ వర్గాల వారితో అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ అన్ని విషయాలను బహిరంగంగానే మాట్లాడుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా వ్యాపారవేత్తలు, సామాజిక వర్గాల ముఖ్యులను కలుస్తున్నారు. ఇటీవల గ్రామాల వారీగా ఉన్న కుల సంఘాల వివరాలను సేకరించారు. మహిళలకు గ్రూపుల ద్వారా బహుమతులు అందజేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ప్రధాన పార్టీల మధ్యే పోటీ

☛ బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి ప్రశాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి సునీల్‌రెడ్డి, బీజేపీ నుంచి అన్నపూర్ణమ్మ ఎన్నికల బరిలో నిలిచారు. వీరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. మున్నూరుకాపు, గురడిరెడ్డికాపులు, ముదిరాజ్‌లు, మైనార్టీలు, పద్మశాలీలు, ఎస్సీలు, ఇతర కుల సంఘాల నాయకులను కలుస్తున్నారు. ప్రధాన పార్టీల నుంచి ముగ్గురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే కావడంతో ఈ సామాజిక వర్గాలపైనే దృష్టి సారించి వారిని తమ వైపు తిప్పుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

☛ ఆర్మూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి వినయ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి రాకేశ్‌రెడ్డి పోటీల్లో ఉన్నారు. వీరు నియోజకవర్గంలోని మండలాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మున్నూరుకాపులు, గురడిరెడ్డికాపులు, పద్మశాలీలు, ముదిరాజ్‌లు, ఎస్సీ, ఇతర కులసంఘాలు ఉన్నాయి. ఆత్మీయసమ్మేళనాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధాన సామాజిక వర్గాల పెద్దమనుషులతో సమాలోచనలు చేస్తున్నారు.

☛ అర్బన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గణేశ్‌గుప్తా, కాంగ్రెస్ నుంచి షబ్బీర్‌అలీ, బీజేపీ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ పోటీల్లో ఉన్నారు. వీరి మధ్య పోటీ హోరాహోరీగా సాగుతోంది. ఇప్పటి వరకు నిర్వహించిన ఎన్నికల్లో మున్నూరుకాపులు, పద్మశాలీలు, మైనార్టీ వర్గాల మద్దతుతోనే వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు గెలుపొందారు. దీంతో వీరు ఈ మూడు సామాజిక వర్గాలపైనే అభ్యర్థులు దృష్టి సారించి విజయానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

☛ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, కాంగ్రెస్ నుంచి భూపతిరెడ్డి, బీజేపీ నుంచి కులచారి దినేశ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ ప్రధానంగా మున్నూరుకాపు, పద్మశాలీలు, గిరిజనులు, మోటడిరెడ్డిలు, గురడిరెడ్డిలు, మైనార్టీలు, ఎస్సీలతోపాటు ఇతర కులసంఘాల సభ్యులు ఉన్నారు. ఈ వర్గాల ద్వారా గెలిచేందుకు ప్రధాన పార్టీలు తమ వైపు తిప్పుకొనేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

☛ బోధన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి షకీల్, కాంగ్రెస్ నుంచి సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నుంచి మోహన్‌రెడ్డి ఎన్నికల బరిలో ఉన్నారు. ఇక్కడ మైనార్టీలు, మున్నూరుకాపులు, పద్మశాలీలు, లింగాయత్‌లు, సెటిలర్లు, ఎస్సీలు, ఇతర కులసంఘాలు ఉన్నాయి. ఈ వర్గాలను తమ వైపు తిప్పుకొని ఎన్నిలలో గెలుపొందేందుకు ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయి.

వేల్పూర్‌కి వస్తా చర్చకు సిద్ధమా..

- మంత్రికి కర్ణాటక ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ సవాల్
- నేడు వేల్పూర్ చౌరస్తాకు వస్తానని స్పష్టీకరణ



మాట్లాడుతున్న ప్రదీప్ ఈశ్వర్, ముత్యాల సునీల్‌రెడ్డి

మోర్తాడ్: కర్ణాటకలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మహారాష్ట్రకు చెందిన చిక్బల్లాపూర్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ సవాల్ విసిరారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు వేల్పూర్ చౌరస్తాకు వస్తానని అక్కడ చర్చకు సిద్ధంగా ఉండాలన్నారు. మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో బాల్కొండ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డితో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్ణాటక పథకాలపై బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కర్ణాటకకు కారులో వెళదామా లేదా విమానంలో వెళదామా తేల్చుకోవాలని ఖర్చంతా తనదేనని అన్నారు. అక్కడ ఏ ఊరికి వెళదామో మీరే నిర్ణయించి చెప్పాలని, ఒక వేళ అక్కడ తమ పథకాలు అమలవుతున్నాయని తెలిస్తే ఇక్కడ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓడిపోతున్నామనే భయంతోనే మంత్రితో పాటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కర్ణాటక పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- మంత్రి హరీశ్ రావు సోదరుడు మహేశ్ రావు



బీబీపేట: గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి పనులు కేవలం బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, ఆ ఘనత కేసీఆర్‌దేనని మంత్రి హరీశ్‌రావు సోదరుడు మహేశ్‌రావు అన్నారు. మంగళవారం ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పలు ప్రధాన కాలనీల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే ఇదే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని అన్నారు. ప్రచారంలో ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల్లో 'ఏనుగు' కబ్జా



బాన్సువాడలో మాట్లాడుతున్న దళితులు

బాన్సువాడ: ఎర్రపహాడ్‌లో దళితుల భూములను మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కబ్జా చేశారని ఎర్రపహాడ్‌కు చెందిన దళితులు చిట్యాల సాయన్న, దుర్గవ్వ, బాలయ్య ఆరోపించారు. బాన్సువాడలోని భారత్‌గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాడ్వాయి మండలం ఎర్రపహాడ్‌లో గతంలో 25 మంది దళితులకు ప్రభుత్వం 30 ఎకరాల భూమిని ఇస్తే ఆ భూమి పక్కనే 300 ఎకరాలను కొనుగోలు చేసిన ఏనుగు రవీందర్‌రెడ్డి దళితుల భూములను కూడా ఆక్రమించారని అన్నారు. తమ భూములు ఇవ్వమన్నందుకు పీఎస్‌లో పోలీసులతో కొట్టించారని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి, కామారెడ్డిలో కూడా కేసులు పెట్టించారని అన్నారు. ప్రస్తుతం అదే వ్యక్తి బాన్సువాడలో సైతం భూములను ఆక్రమించుకునేందుకు వచ్చారని, ప్రజలు ఆయన చేతుల్లో మోసపోవద్దని కోరారు.

ధాన్యం రైతు రిమాండ్

మోపాల్: మండలంలోని కాస్‌బాగ్‌తండాకు చెందిన రైతు గణపతిని రిమాండ్ చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 4న కాల్‌పోల్‌కు చెందిన శైలజ, తన కుమారుడితో ద్విచక్రవాహనంపై నిజామాబాద్ వైపు వెళ్తోంది. కాస్‌బాగ్ తండా వద్ద ధాన్యం కుప్పను ఢీకొని అదుపు తప్పి కింద పడిపోయారు. ప్రమాదంలో శైలజకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 6న మృతిచెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధాన్యం కుప్ప యజమాని గణపతిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కరాటేలో మెడల్స్ సాధించిన తాడ్వాయి విద్యార్థులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు కరాటేలో జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న నామాల నవ్యశ్రీ, కేపీ సింధూలు ఈ నెల 19న మేడ్చల్ జిల్లాలో జరిగిన కరాటే పోటీల్లో జాతీయ స్థాయిలో ఆడి ప్రతిభను కనబరిచారన్నారు. నవ్యశ్రీకి సిల్వర్ మెడల్, సింధు బ్రాంచ్ మెడల్ సాధించిందన్నారు. వీరిని ఉపాధ్యాయులు, కోచ్ అజ్జపల్లి నీరజ అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లిలో పేకాట స్థావరంపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మంగళవారం దాడి చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. దాడిలో 13 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 9,970 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేస్తా..

- బీఆర్ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



గోపూర్‌లో మాట్లాడుతున్న పోచారం

వర్ని (మోస్రా): ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. మండలంలోని తిమ్మాపూర్, చింతకుంట, చే నంబర్ తండా, మోస్రా, గోపూర్ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మోస్రా మండలంలోని నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియాలో సాగునీటి కోసం లిఫ్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని పనులు పూర్తయితే వేల ఎకరాల పంటలకు సాగునీటి సమస్య తీరుతుందన్నారు. ప్రజలు ఎన్నికల్లో డబ్బుకు ఆశపడకుండా అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఓటర్లకు డబ్బులను ఎరచూపే ప్రయత్నం చేస్తున్నారని వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రచారాల్లో మోస్రా జెడ్పీటీసీ విజయాభాస్కర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ పిట్ల శ్రీరాములు, పార్టీ మండల అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, సర్పంచులు భూమన్న, విమల లింగన్న, నరేందర్ రెడ్డి, సైనపురం సుమలతారాంరెడ్డి, మేను బాయి ధర్మా నాయక్ పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

- బీఆర్ఎస్ అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

నిజామాబాద్‌నాగారం: నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, అభివృద్ధి చేసే అవకాశం మళ్లీ ఇవ్వాలని బీఆర్ఎస్ అర్బన్ అభ్యర్థి, ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ప్రజలను కోరారు. నగరంలోని 9, 10 డివిజన్లలో ఎమ్మెల్యే దంపతులు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో–ఆర్డినేటర్ బిగాల మహేశ్, బిగ్‌బాస్ ఫేం, యాంకర్ శివజ్యోతితో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. సాయినగర్, ఇంద్రపూర్, సంతోష్‌నగర్, నాగారంలో ఇంటింటా తిరుగుతూ కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూ కిరణ్, కార్పొరేటర్లు సాధు సాయివర్ధన్, బొడిగం కోమల్ నరేశ్, నాయకులు దండు శేఖర్, కర్ణ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



జంగంపల్లిలో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

భిక్కనూరు/రాజంపేట: యాభై ఏండ్లు పాలించిన కాంగ్రెస్‌తో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమి లేదని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మంగళవారం ఆయన భిక్కనూరు మండలం జంగంపల్లిలో, రాజంపేట మండలంలోని పొందూర్తి, శివాయిపల్లి, తలమడ్ల, ఆరేపల్లి గ్రామాలలో సీఎం కేసీఆర్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. దేశంలో బీజేపీ పాలిత ప్రాంతాలలో తెలంగాణలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ కంటే ముందు తెలంగాణను పాలించిన కాంగ్రెస్ తెలంగాణను ఎంత వరకు అభివృద్ధి చేసిందో ప్రజలు ఆలోచించాలని కోరారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. ప్రతిపక్ష పార్టీలు రైతుల భూములు పోతాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఒక్క గుంట భూమి కూడా ఎవరూ తీసుకోరన్నారు. ఓటుకు నోటు కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డిని తుక్కుతుక్కుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రాజంపేట మండలంలోని పొందూర్తి గ్రామానికి చెందిన మర్కంటి ఎల్లయ్య, గంపగోవర్ధన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ నర్సింలు యాదవ్, తదితరులున్నారు.

పతి కోసం.. సతి ప్రచారం



మోర్తాడ్‌లో ప్రచారం చేస్తున్న సునీల్‌రెడ్డి భార్య దీప్తి



ఏర్గట్లలో ప్రశాంత్‌రెడ్డి భార్య నీరజ

- బాల్కొండలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కుటుంబ సభ్యుల ప్రచారం

మోర్తాడ్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రెండు ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయాన్ని ఆకాంక్షిస్తూ వారి కుటుంబ సభ్యులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ముత్యాల సునీల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి దీప్తి, బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి భార్య నీరజ ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. పతి కోసం సతి ప్రచారం చేయడంలో భాగంగా ఓటర్లను స్వయంగా కలుసుకుంటూ పార్టీ మేనిఫెస్టోలతో పాటు ఇతర సేవా కార్యక్రమాలను వివరిస్తున్నారు. అభ్యర్థుల భార్యల ప్రచారంలో ఆయా పార్టీల కార్యకర్తల భార్యలు కూడా పాలుపంచుకోవడం విశేషం. అభ్యర్థులు గ్రామాల్లో కార్నర్ సమావేశాలు నిర్వహిస్తుంటే వారి భార్యలు, కుటుంబ సభ్యులు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు.

అత్తా, అల్లుళ్ల మధ్య పోటీ

- రసవత్తరంగా బాల్కొండ పోరు
- బీజేపీ అభ్యర్థిగా అన్నపూర్ణమ్మ
- బీఆర్ఎస్ అభ్యర్థిగా అన్న కొడుకు ప్రశాంత్‌రెడ్డి




ఏలేటి అన్నపూర్ణమ్మ



వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్: రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా పనిచేసిన చరిత్ర ప్రశాంత్‌రెడ్డి సొంతం. ఈసారి మేనల్లుడు అయిన ప్రశాంత్‌రెడ్డిపై ఎలాగైన విజయం సాధించాలని మేనత్త అన్నపూర్ణమ్మ పంతం. బీజేపీ అభ్యర్థిగా ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ పోటీ చేస్తుండగా ఆమె సోదరుని కుమారుడు మేనల్లుడైన వేముల ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన వేముల సురేందర్‌రెడ్డికి స్వయానా చెల్లెలు అన్నపూర్ణమ్మ. ఆమె పుట్టినిల్లు వేల్పూర్ కాగా మెట్టినిల్లు కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి. మేనత్త, అల్లుడు రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులుగా బరిలోకి దిగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 2014 ఎన్నికల్లో ప్రశాంత్‌రెడ్డి మేనత్త కొడుకైన మల్లికార్జున్‌రెడ్డితో పోటీ పడి విజయం సాధించారు. ఇప్పుడు మేనత్తతో పోటీలో నిలువడం విశేషం. వీరి మధ్య పోరు రసవత్తరంగా కొనసాగుతోంది.

విద్యుదాఘాతంతో ఐదు గుడిసెలు దగ్ధం



దగ్ధమవుతున్న గుడిసెలు

బీబీపేట: విద్యుదాఘాతంతో ఐదు గుడిసెలు దగ్ధమైన ఘటన మండలంలోని మాందాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సడుగు గంగారాం, సడుగు పర్శరాంలు, సడుగు లక్ష్మి, సడుగు రాజయ్య, సడుగు చిన్న శంకరయ్య చాలా ఏళ్లుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం ఒక గుడిసెలో నుంచి మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న ఇళ్లకు పాకింది. సిలిండర్లు పేలడంతో మంటలు మరింత చెలరేగాయి. స్థానికులు చల్లార్చడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ప్రమాదంలో సుమారు 8 తులాల బంగారం, 152 తులాల వెండి, రూ. 5,55,000 నగదు కాలిపోయినట్లు ఐదు కుటుంబాల బాధితులు తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

క్రైం కార్నర్

ఇంటిపై రౌడీషీటర్ల దాడి



బాధితుడు సయ్యద్ రహ్మాన్



దాడిలో చెయ్యి విరిగిన సయ్యద్ యూసుఫ్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ వ్యక్తి ఇంటిపై కొందరు రౌడీ షీటర్లు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని ఒకటో టౌన్ పరిధిలోని కొజ్జా కాలనీకి చెందిన సయ్యద్ యూసుఫ్ ఇంటిపై ఈ నెల 17న రాత్రి కొందరు రౌడీ షీటర్లు దాడికి పాల్పడ్డారు. యూసుఫ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులపై కర్రలతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. దీంతో సయ్యద్ రహ్మాన్ డయల్ 100కు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకొని గొడవ చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. సయ్యద్ రహ్మాన్ ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబుకు ఫిర్యాదు చేసిన దాడి చేసినప్పటికీ వారిపై చర్యలు తీసుకోవడం లేదని బాధితుడు తెలిపాడు. తమకు వారి నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని సీపీకి ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి మృతి



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై రాజు

రుద్రూర్: అనారోగ్యంతో రెండు రోజుల క్రితం ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని జవహార్‌నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బడె సాయిలు (42) రేషన్‌షాపులో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. సాయిలు భార్య 12 ఏళ్ల క్రితం కుటుంబా తగాదాలతో ఇంటి నుంచి వెళ్లిపోగా 6 ఏళ్ల క్రితం తల్లితండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. నాటి నుంచి రేకులషెడ్డులో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. సాయిలుకు కల్లుతాగే అలవాటు ఉందని, సరిగా తినకపోవడం వల్ల అనారోగ్యానికి గురయ్యాడని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితమే సాయిలు మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీరేశ్ పేర్కొన్నారు.

మద్యం పట్టివేత



మద్యంతో పోలీసులు

ఎల్లారెడ్డి: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆటోను, మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ మంగళవారం తెలిపారు. గాంధారి మండలం కేంద్రం నుంచి చద్మల్‌కు టాటా ఎస్ వాహనంలో తరలిస్తున్న 384 మద్యం బాటిళ్లను పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మద్యాన్ని తరలిస్తున్న నేరల్‌తండాకు చెందిన కటారియా రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై జలీలుద్దీన్, సిబ్బంది ఉన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో ఒకరి నుంచి రూ. 5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. అతని వద్ద ఎలాంటి లేకపోవడంతో నగదును సీజ్‌చేసి రిటర్నింగ్ అధికారి భుజంగ్‌రావుకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

భిక్కనూరులో..



భిక్కనూరు: మండల కేంద్రంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో ఒకరి నుంచి రూ.60,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. ఈ నగదును టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

బహిరంగ వేలము ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లి. నిజామాబాద్ మరియు బోధన్ శాఖల వారి ఈ క్రింద తెలుపబడిన వాహనములు బహిరంగ వేలము నిర్వహించబడును.

VEHICLE NO	MODEL	MFG YEAR
TS07UA 4193	EICHER 11.10 FBT	2015
UNREG 2018	ACE ACT 60 COMBINE HARVESTER	2018
AP25AH 8830	JOHN DEERE 5204	2012
TS16UB 5463	EICHER 380	2018
TS16UC 8988	AL COMET CT 1616 FBT	2011
TS16UD 0453	AL 1616XL FBT - T	2013
TS15EA 7915	JCB 3DX	2014
TS16UB 7870	AL 1616 XL FBT - T	2011

SHRIRAM Finance

AUCTION DATES: 22.11.2023 , 29.11.2023

SHRIRAM AUTMALL INDIA LIMITED NIZAMABAD
H.No. 5-1, Aurgul Village, Jakranpally Mandal, Nizamabad Dist. Telangana - 503224,
Cell: 7793999220, 9701878143

CHANGE OF NAME

■ I, PUJARI JYOTHI BHANUDAS RAO (Old Name) H.NO.3-66, VARNI, NZB Hence changed my name as JAIKAR JYOTHI W/o. JAIKAR SHYAM KUMAR (New name) [Z-799650]

WANTED

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ HYD RP ఎస్టేట్స్‌లో HMDA DTCP YTDA AND RERA APPROVED కలిగిన వెంచర్స్‌లో మార్కెటింగ్ చేయుటకు యువతీ యువకులు కావలెను. అనుభవం & చదువుతో పనిలేదు. రిటైర్డ్ ఉద్యోగులు.. గృహిణులు.. రియల్ ఎస్టేట్ లో అనుభవం కలవారికి ప్రాధాన్యం..వేతనం & కమీషన్ ఇవ్వబడును. ఆసక్తి కలవారు సంప్రదించు ఇంటర్వ్యూ తేది: 22-11-2023, 10:00 a.m 6:00 p.m హోటల్ హరిత: NZB: 8179910567, 8885351972 [Z-799649]

SERVICES

■ష్యూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468 [W-788952]

OLD AGE HOME

■ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664 / 8977639665. [H-793653]

CHANGE OF NAME

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.